ప్రజాశక్తి

బుధవారం 12 జూన్ 2024 12 పేజీలు


గుంటూరు


పల్నాడు

తొలి జాబితాలో నలుగురి పేర్లు

- నాదెండ్ల మనోహర్, లోకేష్, కన్నా లక్ష్మీనారాయణ, ఆనంద్‌బాబుకు ఛాన్సు!
- ఉమ్మడి జిల్లాలో 10 మంది ఆశావాహులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబుతోపాటు ఇతర మంత్రివర్గమూ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఎవరికి స్థానం దక్కుతుందనేది ఉత్కంఠ భరితంగా మారింది. రాత్రి 11 గంటల వరకు టిడిపి నుంచి స్పష్టమైన జాబితా బయటకు రాలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపికలు జరుగుతున్నట్లు తెలిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈసారి నలుగురి పేర్లు తొలిపరిశీలనలో దాదాపుగా ఖరారైనట్లు 3లో


నాదెండ్ల మనోహర్, నారా లోకేశ్, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు


సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా విద్యుత్ దీపాలతో ముస్తాబైన గుంటూరు కలెక్టరేట్

కౌలు రైతులు గుర్తింపు కార్డులు కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని కౌలు రైతులు కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి శిరీష తెలిపారు. యజమాని పాస్ పుస్తకంతో పాటు కౌలు రైతు ఆధార్ జిరాక్స్ కాపీతో విఆర్ఓను కలవాలన్నారు. గత సంవత్సరం మండల వ్యాప్తంగా మూడు వేల మందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం ఇవ్వగా 2800 మందికి ఇచ్చామన్నారు. ఈ సంవత్సరం 3123 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని టార్గెట్ ఇచ్చారని, ఇతర వివరాలకు గ్రామ విఆర్ఓను సంప్రదించాలని కోరారు. మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో 40 నుండి 50 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా 820 మంది రైతుల పొలాల్లో శాంపిల్స్ తీయవలసి ఉన్నదని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రంలోని వి ఏ ఏ ను సంప్రదించి తమ పొలాల్లో మట్టి నమూనాలు పరీక్షించుకోవచ్చునని తెలిపారు.

సిఎం ప్రమాణస్వీకారం వీక్షణకు ఎల్ఈడి స్క్రీన్లు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబు నాయుడు కేసరపల్లి వద్ద నేడు ఉదయం 11.27 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రజలు తిలకించేందుకు గుంటూరు నగరం లో 14 ప్రాంతాల్లో ఎల్.ఈ.డి. స్క్రీన్‌లు ఏర్పాటు చేశామని నగర కమిషనర్ కీర్తిచేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని ప్రధాన కూడళ్ళు అయిన బస్టాండ్ వద్ద గల ఎన్.టి.ఆర్. సర్కిల్, బారా ఇమాం పంజా సెంటర్, పొన్నూరు రోడ్డులోని తూర్పు ఎంఎల్‌ఏ కార్యాలయం వద్ద, మాయా బజార్ సెంటర్, పాత గుంటూరు ఆంజనేయ స్వామి గుడి వద్ద, హిమని సెంటర్, ఏటుకూరు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద, నాజ్ సెంటర్, డొంక రోడ్డులోని ఓంకారం గుడి వద్ద, ఎన్.టి.ఆర్. స్టేడియం, శ్రీనివాసరావుపేటలోని పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్‌ఏ కార్యాలయం వద్ద, గుజ్జనగుండ్ల సెంటర్, అమరావతి రోడ్డు, మిర్చి యార్డ్ వద్ద ఎల్.ఈ.డి. స్క్రీన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, గాంధీ పార్కులను విద్యుత్ దీపాలతో అలంకరణ చేయడం జరిగిందని పేర్కొన్నారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన జిఎంసి ప్రధాన కార్యాలయం

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు

నీట్ పరీక్షలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నీట్ యూజీ ఫలితాల్లో హర్యానాలోని ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంకు రావటం, వారందరికీ 720కి 720 రావటంతో ఎన్నో అనుమానాలు వస్తున్నా యన్నారు. అదే సెంటర్‌లో పరీక్ష రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలకు జవాబు రాయగా, అందులో 163 కరెక్ట్ అయ్యాయని, ఆమెకు 636 మార్కులు రావాల్సి ఉంటే 720 మార్కులు వచ్చాయన్నారు. అనేక మందికి 718, 719 మార్కులు వచ్చాయని, ప్లస్ 4, మైనస్ 1 విధానాన్ని అనుసరిస్తే ఆ విధంగా ఎలా సాధ్యమని ప్రశ్నించారు. జూన్ 14న ఫలితాలు విడుదల చేస్తామని ప్రక టించి, ఎన్నికల కౌంటింగ్ రోజు విడుదల చేయటం ఎన్నో అనుమానాలను బలపరుస్తు న్నాయన్నారు. కావున ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి, అభ్యర్థులకు న్యాయం చేయాలని, అలాగే నేషనల్ టెస్ట్ ఏజెన్సీ నిర్వహించిన ఇతర పరీక్షలపైనా విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం కిరణ్ కోరారు.

తొలి జాబితాలో నలుగురి పేర్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. వీరిలో టిడిపి నుంచి నారా లోకేష్, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు, జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ పేర్లు ఉన్నట్టు తెలిసింది. చివరి దశలో మార్పులు జరిగితే రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పేరు కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఇతర జిల్లాలల్లో జరిగే మార్పులకు అనుగుణంగా చివరి దశలో మార్పులు ఉంటాయని తెలుస్తోంది.

జనసేన నుంచి నాదెండ్ల మనోహర్‌కు కచ్చితంగా ఉండటం వల్ల టిడిపిలో కీలకమైన నేతల ఆశలపై నీళు చల్లినట్లు తెలిసింది. నాదెండ్లను మరోసారి స్పీకర్ పదవి తీసుకోవాలని చంద్రబాబు వత్తిడి తెస్తున్నారని కూడా టిడిపి వర్గాల్లో ప్రచారమవుతోంది. ఇందుకు మనోహర్ ససేమిరా అన్నట్టు సమాచారం. మనోహర్ మంత్రి పదవిపైనే ఆశలు పెట్టుకున్నారు. స్పీకర్ పదవి ఇస్తే మాత్రం సీనియర్ ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, యరపతినేని శ్రీనివాసరావు, జి.వి.ఆంజనేయులులో ఒకరికి అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో సమీకరణలు మారి ఆనంద్‌బాబుకు అవకాశం ఇవ్వకపోతే తనకు ఛాన్సు వస్తుందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆశపడుతున్నారు.

టిడిపి నుంచి పోటీ చేసిన వారందరూ ఎన్నిక కావడంతో ఈసారి పార్టీలో అంతర్గతంగా పోటీ పెరిగింది.జూనియర్, సీనియర్ తేడా లేకుండా ఎవరికి వివిధ సామాజిక తరగతుల్లో తమకు మంత్రిగా అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు. తొలిసారిగా ఎన్నికైన నశీర్ అహ్మద్ మైనార్టీ కోటాలో, బిసి మహిళగా గల్లా మాధవి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. బిసి కోటాలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పేరు వినిపిస్తోంది. ఆయన వరసగా మూడుసార్లు గెలుపొందడం కూడా, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో బిసిల్లో సీనియర్‌గానూ ఆయన ఉండడం కీలకంగా మారింది.

మనోహర్, లోకేష్‌కు స్థానం దక్కడం వల్ల కమ్మ సామాజిక తరగతిలో ఇతర సీనియర్ నాయకులకు అవకాశం తక్కువగా ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో బిజెపి, జనసేన నుంచి కూడా ఇదే సామాజిక తరగతుల నుండి ఇద్దరికి అవకాశం ఉంటుందని ప్రచారంతో ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో పత్తిపాటి పుల్లారావు, యరపతినేని, జి.వి. ఆంజనేయుల ఆశలపై నీళ్లుచల్లినట్టు అయిందంటున్నారు. అయితే చంద్రబాబు మనస్సులో ఏముందో.. గతంలో పార్టీకి తాము చేసిన సేవలకు అనుగుణంగా తమకు ప్రాధాన్యం ఉంటుందని టిడిపి నుంచి గెలిచిన సీనియర్ ఎమ్మెల్యేలు ఆశపడుతున్నారు.

ఎరువుల కొరతను అస్సలు సృష్టించొద్దు

ఖరీఫ్‌లో సరఫరాపై డీలర్లతో సమీక్షలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి 244620 హెక్టార్లలో సాగవుతుందని వీటిలో మిర్చి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత సృష్టించకుండా డీలర్లు రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ. మురళి అన్నారు. మంగళవారం నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల గ్రామ పరిధిలో గల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎరువుల సరఫరా - ప్రణాళిక తదితర అంశాలపై మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ ప్రత్తి సాధారణ విస్తీర్ణం 107186 హెక్టార్లు కాగా మిరప పంట సాధారణ విస్తీర్ణం 58202 హెక్టార్లు అంచనా వేశామన్నారు. వాతావరణ శాఖ ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదు అవుతుందని నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ గ్రేడుల ఎరువులను, సరఫరా ప్రణాళిక ప్రకారం సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో 79100 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో అన్ని మండలాలలో ఎరువులు ఎటువంటి వ్యత్యాసం లేకుండా సరఫరా ప్రణాళిక ప్రకారం అందుబాటులో వుంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సి హెచ్. రవి కుమార్, వ్యవసాయ అధికారి ఆర్. సుజాత మరియు వివిధ ఎరువుల కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయోమయంలో వాలంటీర్లు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓటమి చవిచూచింది. దీంతో గ్రామ వాలంటీర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు విధుల నుంచి తాత్కాలిక తప్పుకోవాలని షరతు విధించారు. ఇదే అదనగా వైసిపి నాయకులు వాలంటీర్లతో రాజీనామాలు చేయించారు. మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 258 వరకు వాలంటీర్లను గత వైసిపి ప్రభుత్వం నియమించింది. ఎన్నికల నేపథ్యంలో వైసిపి నాయకుల ఆదేశాలతో వీరిలో ఎక్కువ మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్నికల్లోనూ వైసిపికి అనుకూలంగా ప్రచారం చేశారు. కొన్నిచోట్ల వీరే నాయకులుగా వ్యవహరించి ఓట్ల లావాదేవీల్లో పాల్గొన్నట్లు సమాచారం. ప్రస్తుతం టిడిపి అధికారంలోనికి రావడంతో వారి భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. నాయకుల మాట నమ్మి రాజీనామా చేశామని పలువురు వాలంటీర్లు ఆవేదనకు గురవుతున్నారు. రాజీనామా చేయని వాలంటీర్ల సైతం భవిష్యత్తుపై మథనపడుతున్నారు. నూతన ప్రభుత్వం వాలంటీలను నియమిస్తున్న తరుణంలో తమకు అవకాశం లభిస్తుందో లేదో అని వాలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రభుత్వం వాలంటీర్లకు డిగ్రీ అర్హత ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



ఒక్కొక్కరికి రూ.10 వేల వేతనంతో పాటు గణనీయంగా వాలంటీర్లను తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

డ్రెయినేజీలపై రాళ్లను తీయకుంటే మేమే తీయిస్తాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డ్రెయినేజీలో పూడిక తీత పనులకు అవరోధంగా ఉన్న స్లాబ్ రాళ్లను తక్షణమే తొలగించాలని సిబ్బందిని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఆదేశించారు. 28 వార్డు ప్రాతూరు శివాలయం బజారు వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి పూడికతీత పనులను పర్యవేక్షించారు. పలుచోట్ల పూడికతీత పనులకు డ్రెయినేజీలపై ఉన్న స్లాబ్ రాళ్లు అవరోధంగా ఉండడం గమనించి వెంటనే వాటిని తొలగించాలని చెప్పారు. స్లాబ్ రాళ్లను స్వచ్ఛందంగా తొలగించకపోతే పురపాలక సంఘం తరఫున తొలగించి అందుకయ్యే ఖర్చును వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో టీఎంఎక్స్ మిషన్ ద్వారా జరుగుతున్న డి-సిల్టేషన్ పనులను చేపట్టాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో వ్యాపారులు



వార్డుల పరిశీలనలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

డ్రెయినేజీలను ఆక్రమించి స్లాబ్ రాళ్లను ఏర్పాటు చేశారని, దీనివల్ల డి-సిల్టేషన్ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని అన్నారు. సకాలంలో పూడికతీత పనులు పూర్తి కాకపోతే రానున్న రోజుల్లో వర్షాలు పడే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల వ్యాపారులు సహకరించి స్వచ్ఛందంగా డ్రైనేజీలపై వేసిన రాళ్ళను తొలగించాలని సూచించారు. వర్షాకాలంలో ఎక్కడా నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. బిల్డింగ్ మెటీరియల్స్, రోడ్లపై బండలు రాళ్లు, బిల్డింగ్ నిర్మాణాలు చేసే కాల్వల్లో పూడిపోయి ఉండడాన్ని గమనించారు. వీటి తొలగింపుపై గతంలోనే చెప్పినా చేయకపోవడంతో సంబంధిత టౌన్ ప్లానింగ్ సెక్రటరీకి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా వార్డుల్లో భూగర్భ డ్రెయినేజీ సంబంధించి పైప్‌లైన్‌ల అవసరాన్ని గుర్తించారు. మురుగు కాల్వలలో పూడికతీత పనులు చేపట్టేందుకు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయాలని గతంలో చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎమినిటి సెక్రటరీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పిఏసిఎస్ చైర్మన్ బొల్లా వెంకట రాధాకృష్ణ రాజీనామ

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు పిఏసిఎస్ చైర్మన్ బొల్లా వెంకట రాధాకృష్ణ తన పదవికి రాజీనామా చేసినట్లు పిఏసిఎస్ కార్యదర్శి పోక కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. బొల్లా వెంకట రాధాకృష్ణ 2019 నుండి ఈపూరు పిఏసిఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికలలో వైసిపి పరాజయం చెందడంతో తన పదవికి రాజీనామా చేశారు.



లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - వినుకొండ

మార్కాపురం రోడ్డులో గల శ్రీ బాలాజీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద లారీ ఓనర్ల ముఖ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా నాగిరెడ్డి రామిరెడ్డి ఎన్నికవ్వగా వైస్ ప్రెసిడెంట్‌గా బి.వి. కోదండ రామయ్య, సెక్రటరీగా వై.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా ఎస్ కె.షరీఫ్, ట్రెజరర్‌గా వీర్రాజు, గౌరవ అధ్యక్షులుగా దొడ్డ అనంతరెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను లారీ ఓనర్స్ సభ్యులు సత్కరించారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని లారీ ఓనర్ల సమస్యలపై దృష్టి సారించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించే దిశగా ముందడుగు వేస్తామని చెప్పారు.



విద్యార్థితోపాటు సత్కారం అందుకుంటున్న తండ్రి, ఉపాధ్యాయుడు

ఉత్తమ విద్యార్థికి నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి - వినుకొండ

చింతలచెరువు సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని గీతాంజలి హైస్కూల్లో 2023-24లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బి.వర్షితకు నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు. తండ్రి బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వర్లును కూడా సత్కరించారు. పి.సుబ్బారావు, జివి.మాధవరావు, ఎంవి శర్మ పాల్గొన్నారు.

రెన్యువల్ తీరు అన్యాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్రంలోని 26 జిల్లాలకు సంబంధించి 352 కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కెజిబివి) గత 12 ఏళ్లుగా పనిచేస్తున్న ప్రిన్సిపల్స్ సిఅర్‌టీలకు ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో చివరి పని దినం కాంకుడా మే నెల మొదటి రోజు నుండి రెనువల్ చేయ్యటం అన్యాయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మాజీ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది రెన్యువల్ కోసం పెర్ఫార్మెన్స్ అని సాకు చూపి టీచర్ల హాజరు, పనితీరు ఫలితాలు, విద్యార్థుల నమోదు, స్థానిక నివాసం, మార్కుల ఆధారంగా చేసుకుని రెన్యువల్ చేయాలని సమగ్ర శిక్ష అధికారులు ఉత్తర్వులు జారీ చేయటం అన్యాయమని తెలిపారు. విద్యాశాఖలో ఏ మేనేజ్మెంట్‌లో లేని అసంబద్ధ నిర్ణయాలు సమగ్ర శిక్ష అధికారులు అమలు చేస్తున్నారని, 12 ఏళ్లుగా బడి మానేసిన డ్రాప్ అవుట్ బాలికలను ఇంటింటికీ తిరిగి పాఠశాలల్లో చేర్చి విద్యనందిస్తున్నారని, తక్కువ జీతంతో ఉదయం నుంచి రాత్రి వరకు బోధన, రాత్రి కేర్ టేకర్‌గా, వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఇంతగా పని చేస్తున్న వారిని వేధించడం తగదని, ఆంక్షలేమీ లేకుండా రెన్యువల్ చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి

ఆశా వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రంమైన ముప్పాళ్లలోని పిహెచ్‌సిలో ఆశా వర్కర్ల మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సుజాత, శివకుమారి, కోశాధికారిగా వెంకాయమ్మ, ఉపాధ్యక్షులుగా రోజా, సహాయ కార్యదర్శిగా షేక్ రమీజా ఎన్నికయ్యారు. మరొక ఆరుగురితో పిహెచ్‌సి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వ ఇచ్చిన హామీలను నూతన ప్రభుత్వం అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా విధులం నిర్వహించిన ఆశా వర్కర్లకు అలవెన్స్ ఇవ్వాలన్నారు.

పురుగు మందు తాగి ఒకరు మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

పురుగు మందు తాగి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కొండవీడు కొండల వద్ద మంగళవారం వెలుగు చూసింది. ప్రత్తిపాడు మండలం పాతమల్లయ్యపాలేనికి చెందిన వజ్రాల సుబ్బారెడ్డి (37) ద్విచక్ర వాహనం మీద వచ్చి మండలంలోని బోయపాలెం సమీపం కొండవీడు కొండల వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి పరిశీలించారు.

ప్రమాణస్వీకార వీక్షణకు భారీ ఏర్పాట్లు



చిలకలూరిపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలకు చిలకలూరిపేట పట్టణ పరిధిలో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లత్కర్ బాలాజిరావు మంగళవారం పరిశీలించారు. చిలకలూరిపేటలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్, గ్రాండ్ వెంకటేష్, ఎస్ఎంఎస్ షాది ఖానా, చౌడయ్య హెల్త్ క్లబ్ తదితర ప్రదేశాలను పరిశీలించి సదుపాయాలపై అడిగి పలు సూచనలిచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి వసతి సౌకర్యంతో పాటు ఉదయం పూట అల్పాహారం అందించాలన్నారు. మరుగుదొడ్ల సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నరసరావుపేట ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని టౌన్‌హాల్‌లో చేసిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి రాలేకపోయిన ప్రతి ఒక్కరూ ఇక్కడి నుండే కార్యక్రమాన్ని వీక్షించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కపిలవాయి విజయ్ కుమార్, మాబు, బడేబాబు, బాలు, మునిసిపల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అరవిందబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో ప్రమాణ స్వీకారాన్ని తిలకించేందుకు డిజిటల్ తెరలు ఏర్పాటు చేసినట్లు సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమీ మంగళవారం తెలిపారు. పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులతోపాటు అందరూ హాజరు కావాలని కోరారు.

అనుమతుల్లేని జెండా దిమ్మెల్ని తొలగించాలని వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మించిన జెండా దిమ్మెలను తొలగించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమీకి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలల క్రితం పట్టణంలో వీధికొక వైసిపి జెండా దిమ్మెని అనుమతుల్లేకుండా, పబ్లిక్ స్థలాల్లో అక్రమంగా నిర్మించారని, అనధికారికంగా, అనుమతుల్లేకుండా నిర్మించిన వైసిపి జెండా దిమ్మెల్ని తక్షణమే చట్టప్రకారం తొలగించాలని కోరారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

వినతిపత్రం ఇచ్చిన వారిలో జనసేన పార్టీ నాయకులు కొమ్మిశెట్టి సాంబశివరావు, రాజశేఖర్ ఉన్నారు.

ఎన్నికల ఘర్షణ కేసుల్లో 32 మంది ఆరెస్టు

ప్రజాశక్తి - మాచర్ల

గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల్లో పెద్దఎత్తున ఘర్ణణలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నమోదు అయిన కేసుల్లో కంభంపాడుకు చెందిన 12 మందిని, వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడేనికి చెందిన 20 మందిని పోలీసులు ఆరెస్టు చేసి స్థానిక న్యాయమూర్తి వద్ద హజరుపర్చినారు. ఎన్నికల అనంతరం వీరాంత గ్రామం విడ్చిపెట్టి పరారిలో ఉన్నట్లు తెలిసింది. సోమవారం రాత్రి వీరు అంత సర్కిల్ కార్యాలయంలో హజరైనట్లు తెలిసింది. మంగళవారం వారిని కోర్టులో హజరు పర్చగా న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ వీరికి రిమాండ్ విధించగా గుంటూరు, నెల్లూరు సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు.

ఇఎపి సెట్‌లో శ్రీచైతన్య విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి-గుంటూరు

ఇఎపి సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎజిఎం దుర్గాప్రసాద్ తెలిపారు. కె.జస్వంత్‌కుమార్ 29వ ర్యాంకు, హరిసాయిశ్రీతేజ 58వ ర్యాంకు, ఎం.మూర్తి మణిదీప్ 77వ ర్యాంకు, సయ్యద్ రేయన్ అహ్మద్ 88వ ర్యాంకు, కె.వెంకట ప్రసూన్ 111వ ర్యాంకు, యం.శివజ్యోతిరాదిత్య 131వ ర్యాంకు, చల్లా ఈషన్ ప్రనీల్ 134, సిహెచ్.సాయి ప్రణవ్ 143, వి.కౌశల్ మాదవ్ 144, కె.ధనుష్ 164, బి.అభిలాష్ 174, జె.అవినాష్ నాయుడు 183, కె.సుమంత్‌రెడ్డి 194వ ర్యాంకు సాధించారన్నారు. టాప్ ర్యాంకర్లను దుర్గాప్రసాద్, డీన్‌లు కిషోర్, చంద్రశేఖర్, సురేష్ అధ్యాపకులు అభినందించారు.



క్యాబినెట్ మంత్రులను కలిసిన పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తనశాఖలకు సంబంధించిన క్యాబినెట్ మంత్రులను మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌ను, ఈశాన్య రాష్ట్రాల అభివద్ధి, కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ఢిల్లీలో డాక్టర్ పెమ్మసాని విడివిడిగా మంగళవారం కలిశారు. పెమ్మసాని మాట్లాడుతూ తన శాఖలకు సంబంధించిన సీనియర్ మంత్రులను కలిసి ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ సమస్యలపై త్వరలోనే పూర్తి వివరాలు అందజేస్తానని అలాగే గ్రామీణ అభివృద్ధితో పాటు కమ్యూనికేషన్స్, గుంటూరు పార్లమెంట్ పురోగతి దిశగా పని చేస్తానని తెలిపారు. నూతన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార అనంతరం తాను పూర్తిస్థాయిలో కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తానని పెమ్మ సాని వివరి ంచారు. ఆయన సతీమణి డాక్టర్ పెమ్మసాని శ్రీరత్న కూడా వెంట ఉన్నారు.



కేంద్ర గ్రామీణాభివృద్ధిమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో పెమ్మసాని దంపతులు



జ్యోతిరాధిత్యసింధియాని కలిసిన పెమ్మసాని

ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తితో టిడిపి నాయకులు త్రిప్పినేని రామకృష్ణ

ప్రజాశక్తి - చేబ్రోలు



నవ్యాంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని టిడిపి నాయకులు త్రిప్పినేని రామకష్ణ తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు 4వ సారి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం మహోత్సవం సందర్భముగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలతో కొత్త ప్రభుత్వం ప్రగతి బాటన నడుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులన్నారు. ఎమర్జెన్సీ సమయంలో జనతా ప్రభుత్వం ఏర్పాటుకు దారి తీసిన విపరీత కారణాలు మాదిరిగానే అదే తరహాలో గత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని రామకృష్ణ పేర్కొన్నారు. దీనికి ఎన్నికల్లో రికార్డ్ స్థాయి ఓటింగ్‌తో ప్రజలు చూపిన నిశ్శబ్ద విప్లవంతో ఎన్డీఏ కూటమి సాధించిన భారీ విజయమే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధారణ ఎన్నికల ఫలితాలతో ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువువులు అని మరోసారి రుజువయ్యిందని పేర్కొన్నారు. ఈ అసాధారణ ఫలితాలు ఏ ఒక్క వర్గానికో గాని, ఏ ఒక్క కులానికో గాని, ఒక్క మతానికో గాని, ఏ ఒక్క పార్టీకో గాని, చెందినవి కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి అభివద్ధి ఫలాలు పొందేందుకు నూతన ప్రభుత్వంలో అందరూ భాగస్వాములు కానున్నారని అది చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. ప్రజలు కలలు కన్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏర్పాటుకు సర్వం సిద్ధం అయిందని రాబోయే ఐదు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి ప్రపంచానికి ఆదర్శంగా అవతరించబోతుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్య వైద్యం ఉత్పత్తి రంగం ప్రాధాన్యత అంశాలుగా నడుస్తాయని, అభివృద్ధి సంక్షేమం ఆరోగ్యం అన్ని రంగాల్లో ప్రజలు మెచ్చే పరిపాలన చంద్రబాబు కొనసాగిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేంద్రంలో రాష్ట్రంలో గెలుపు పొందిన ఎన్ డి ఎ కు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు వినియోగించుకున్న రాష్ట్ర ప్రజలు తమ ఓటు హక్కుతో రాష్ట్రాన్ని నిలబెట్టారని ప్రజాస్వామ్యంలో ప్రజలు నిశ్శబ్దముగా తమ మనోభావాన్ని తెలియజేశారని అన్నారు ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్న విధానం నిజమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలపై వివిధ రకాలుగా అన్ని రంగాలలో ఖర్చులు విపరీతంగా పెంచడం జరిగిందని, దీనివలన కుటుంబం ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని అన్నారు. రాష్ట్ర అభివద్ధికి అవసరమైన రవాణా వ్యవస్థలో రహదారుల నిర్లక్ష్యం, ప్రజా ధనముతో నిర్మించిన పట్టిసీమ లాంటి రైతులకు వ్యవసాయ ఉపయోగార్థమైన నీటి ప్రాజెక్టులు ఉపయోగాన్ని నిలుపుదల చేయటం ప్రజా శ్రేయస్సు కోరే పరిపాలన కాదని అన్నారు. నూతన రాజధాని అభివద్ధి, పోలవరం పూర్తి చేయటం , రైల్వేజోన్ సాధించడం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడం లాంటి అంశాలు గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. భారీ విజయంతో ఆంధ్రప్రదేశ్ లోని వనరులను, అవకాశాలను ఉపయోగించుకుని ప్రజలు మెచ్చే పాలను చంద్రబాబు అందిస్తారని పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని అన్ని పల్లెలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ గెలుపుకు పూర్తిస్థాయిలో అండగా నిలిచాయని అన్నారు. రాజధాని అమరావతిని ప్రజలు మెచ్చే విధముగా, ఆంధ్రప్రదేశ్ సంపద సష్టి కేంద్రముగా మరియు యువతకు అభివద్ధి ఫలాలు అందించే ఉపాధి కేంద్రంగా చంద్రబాబు రాజధాని మంచి అభివృద్ధి ఫలంగా తయారు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి స్టేట్ జనరల్ సెక్రటరీగా పులి ప్రభుదాస్ నియామకం

ప్రజాశక్తి - తుళ్లూరు



ఎస్సి,ఎస్టి పరిరక్షణ మండలి స్టేట్ జనరల్ సెక్రటరీగా రాజధాని అమరావతి పరిధిలోని వెంకటపాలెంకు చెందిన పులి ప్రభుదాస్ నియమించబడ్డారు. మండలి రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. రాజధాని ప్రాంతంలో దళితులు, ఇతర పేదలకు చెందిన అసైన్డ్ భూములకు సమాన ప్యాకేజి, కౌలు తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుదాస్ పనిచేశారని, అదే విధంగా రానున్న రోజుల్లో ఎస్సీ, ఎస్టిలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేయాలని రాజారావు కోరారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

ఆంధ్రాప్యారిస్‌లో మనోహర్ మార్కు అభివృద్ధికే జనం పట్టం

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా మేనిఫెస్టో విడుదల



తెనాలిలోని జిల్లా వైద్యశాలలో తల్లీపిల్లల విభాగం

ప్రజాశక్తి-తెనాలి

హోరాహోరీగా జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఒకరు సంక్షేమం అంటే మరొకరు అభివృద్ధి అంటూ ప్రచారం సాగించారు. అభ్యర్థులతో పాటు కుటుంబ సభ్యులు కూడా పోటాపోటీగా ఇంటింటి ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు ఎన్ని అమలు చేసినా, దానికి తోడు అభివృద్ధి కూడా ముఖ్యమేనని భావించిన ప్రజలు మనోహర్ మార్కు అభివృద్ధికి పట్టం కట్టారు. తెనాలి నియోజకవర్గం ఏర్పడిన తరువాత కనీవినీ ఎరుగని మెజారిటీతో నాదెండ్ల మనోహర్‌ను గెలిపించారు. కాంగ్రెస్ హయాంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మనోహర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, స్పీకర్‌గా పదువులు అలంకరించి, తనదైన శైలిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి నుంచి అన్నాబత్తుని శివకుమార్, ఎన్‌డిఎ కూటమి నుంచి జనసేన అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్ పోటీ చేశారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజలకు విశేషంగా సంక్షేమ పథకాలు అందించా మని, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలను 99 శాతం అమలు చేశామని, తనను గెలిపించా లని శివకుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఆయనతో పాటు ఆయన భార్య, ఇద్దరు కుమారులు కూడా ముమ్మర ప్రచారం చేశారు. ఇదిలా ఉంటే కూటమి నుంచి పోటీ చేసిన నాదెండ్ల మనోహర్‌తో పాటు ఆయన సతీమణి, తనయులు కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొల్లిపర, తెనాలి రూరల్ మండలాలలతో పాటు పట్టణంలో ప్రతి ఇంటింటికీ వెళ్లారు. గతంలో రెండుసార్లు తెనాలి నుంచి గెలుపొందిన మనోహర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. తిరిగి ఈ ఎన్నికల్లో కూడా గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దానికోసం నియోజక వర్గ స్థాయిలో ప్రత్యేక మేనిఫెస్టోను కూడా మనోహర్ విడుదల చేశారు. ఇరు పక్షాలు ఎలా ప్రచారం చేసినా, ఎన్ని వ్యూహాలు పన్నినా జనం మాత్రం అభివృద్ధి వైపు మొగ్గు చూపారు.



తెనాలి అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేస్తున్న నాదెండ్ల మనోహర్ తదితరులు



పెదరావూరు-ఆటోనగర్ నాలుగు లైన్ల రోడ్డు



తెనాలిలోని మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్ భవనం

మనోహర్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు

నాదెండ్ల మనోహర్ కాంగ్రెస్ పార్టీ తరపున 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. సౌమ్యుడు, విద్యావంతులు కావటంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మొదట డిప్యూటీ స్పీకర్‌గా, తదుపరి స్పీకర్‌గా అవకాశం లభించింది. ఆ పదవులకు వన్నె తేవటమే కాకుండా, రాష్ట్ర విభజన సమయంలోనూ వివాదాలకు తావులేకుండా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. మొత్తం పదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారు. తొలుత పెదరావూరు నుంచి ఆటోనగర్ వరకూ నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. తన పదవీకాలంలో పెదరావూరు నుంచి మార్కెట్ వంతెన వరకూ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. తదుపరి అధికారంలోకి వచ్చిన టిడిపి కూడా ఆ రోడ్డు నిర్మాణాన్ని కొంత మేర పూర్తిచేశారు. వైసిపి హయాంలో రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించకపోవటంతో ఇప్పటికీ అసంపూర్తి గానే ఉంది. ఇప్పుడు తిరిగి అధికారంలోకి వచ్చిన మనోహర్ హయాంలోనే ఆ రోడ్డు పూర్తికావాల్సి ఉంది. తెనాలి జిల్లా వైద్యశాలలో తల్లీపిల్లల వైద్యశాల భవన నిర్మాణం, జిల్లా వైద్యశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. మహాత్మాగాంధీ మున్సిపల్ మార్కెట్ భవన నిర్మాణం ఆయన కృషే. చేపల మార్కెట్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది కూడా ఆయనే. అన్నింటినీ మించి మనోహర్‌తో పాటు అప్పటి తెనాలి ఎంపీగా పనిచేసిన వల్లభనేని బాలశౌరి సహకారంతో తెనాలికి రూ.100 కోట్లతో రక్షితనీటి పథకం తెచ్చారు. ఆయన హయాంలోనే ఆ పనులనూ పూర్తి చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం ఆయన హయాంలోనే జరిగింది.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా మేనిఫెస్టో ప్రకటించిన నాదెండ్ల మనోహర్

గతంలో తెనాలి నియోజకవర్గానికి పదేళ్ల పాటు ప్రాతినిధ్యం వహించిన మనోహర్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా ప్రత్యేకంగా మేనిఫెస్టో విడుదల చేసి, తెనాలి అభివృద్ధిపై ఆయనకున్న మక్కువ చాటుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన మనోహర్‌కు క్యాబినెట్‌లో కూడా స్థానం లభిస్తుందన్న వాదన బలంగా వినిపిస్తోంది. దానికి తోడు ప్రస్తుతం ఆయన ముందున్న సవాల్ ఆయన స్వయంగా రూపొందించిన మేనిఫెస్టో. తెనాలి అభివృద్ధి ప్రణాళిక 2024 పేరిట మనోహర్ స్వయంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో తెనాలి నుంచి గుంటూరు, మంగళగిరికి నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ, తెనాలి, కొల్లిపర మండలాల్లో సిసి రోడ్ల నిర్మాణం, మున్సిపాలిటీ వసూలు చేస్తున్న చెత్తపన్ను రద్దు, మెరుగైన శానిటేషన్ విధానం అమలు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా పట్టణంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, తెనాలి జిల్లా వైద్యశాల అధునీకరణ, కేన్సర్ నిర్ధారణ కేంద్రం ఏర్పాటు, నియోజకవర్గం పరిధిలో పిహెచ్‌సిల ఆధునీకరణ, యువతకు ఉపాది కల్పన కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాల ఏర్పాటు, పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో రక్షితనీటి పథకాల ఆధునీకరణ, ముస్లిములకు షాదీఖానా ఏర్పాటు, బీసీలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, క్రైస్తవులకు, ముస్లిమలకు శ్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు, సంగీత అకాడమి ఏర్పాటు, గంజాయి రహిత తెనాలి ప్రధాన అంశాలుగా ఉన్నాయి.





నాడు తండ్రులు.. నేడు తనయులు..

రికార్డుస్థాయి మెజారిటీతో నాదెండ్ల మనోహర్ విజయం

తెనాలి నియోజకవర్గంలో వైవిధ్యం

ప్రజాశకి-తెనాలి

రాజకీయ ఉద్దండులకు నిలయం తెనాలి. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వారిలో ఇద్దరు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసిన చరిత్ర ఉంది. ఎంతో చైతన్యవంతమైన ప్రాంతం కూడా. అందుకే సార్వత్రిక ఎన్నికలంటే అందరి చూపు తెనాలి వైపే ఉంటుంది. ఇక్కడ ఓ ఆనవాయితీ కూడా కొనసాగుతోంది. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారం చేపడుతుందన్న నానుడి కొనసాగింది. ఇలాంటి ప్రత్యేకతలకు వేదికైన తెనాలి నియోజకవర్గంలో మరో అరుదైన ఘటన ఆవిష్కృతమైంది. గతంలో తండ్రులు తలపడితే ఇప్పుడు తనయులు 2024 ఎన్నికల్లో ప్రత్యర్థులయ్యారు.

1989లో నాదెండ్ల వర్సెస్ అన్నాబత్తుని
2024లో నాదెండ్ల వర్సెస్ అన్నాబత్తుని

నియోజకవర్గంలో ఒకప్పుడు తండ్రులు తలపడితే, తాజాగా తనయులు తలపడ్డారు. 1989 సాధారణ ఎన్నికల్లో డిటిపి నుంచి అన్నాబత్తుని సత్యనారాయణ, కాంగ్రెస్ నుంచి నాదెండ్ల భాస్కరరావు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో వరుసగా అంటే 1983, 1985 ఎన్నికల్లో టిడిపి నుంచి వరుసగా గెలుపొంది, రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేసిన అన్నాబత్తుని సత్యనారాయణ, కాంగ్రెస్ నుంచి పోటీచేసిన మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు చేతిలో పరాజయం చవిచూశారు. తాజాగా జరిగిన 2024 ఎన్నికల్లో నాదెండ్ల భాస్కరరావు తనయుడు, నాదెండ్ల మనోహర్ జనసేన తరపున ఎన్‌డిఎ కూటమి తరుపున జనసేన అభ్యర్థిగా పోటీ చేయగా, వైసిపి నుంచి అన్నాబత్తుని సత్యనారాయణ తనయుడు అన్నాబత్తుని శివకుమార్ పోటీ చేశారు. శివకుమార్ ఘోర ఓటమి చవిచూడగా, మనోహర్ ఘన విజయం సాధించారు. గతంలో అంటే 2004, 2009లో కాంగ్రెస్ తరపున మనోహర్ విజయం సాదించిన సంగతి తెలసిందే. అన్నాబత్తుని శివకుమార్ కూడా 2014 ఎన్నికల్లో వైసిపి నుంచి ఓటమి చెందినా, 2019 ఎన్నికల్లో తిరిగి గెలిచారు. 2024లో మూడోసారి మనోహర్ చేతిలో శివకుమార్ ఓడిపోయారు. నాడు నాదెండ్ల భాస్కరరావు అన్నాబత్తుని సత్యనారాయణను ఓడిస్తే, నేడు నాదెండ్ల మనోహర్, అన్నాబత్తుని శివకుమార్‌ను ఓడించారు. ఒకే నియోజకవర్గంలో తండ్రులు, తనయులు పోటీ చేసి ఒకే రకమైన ఫలితాలను చవిచూడటం విశేషం.

నియోజకవర్గం ఆరంభం నుంచి విజేతల వివరాలు

తెనాలి నియోజకవర్గం 1951లో ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వారిలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారు. నాదెండ్ల భాస్కరరావు 31 రోజులు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కొణిజేటి రోశయ్య కూడా వైఎస్ మరణానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇక నియోజకవర్గంలో పోటీ చేసిన వారి వివరాలు పరిశీలిస్తే 1952, 1955, 1962లో వరుసగా ఆలపాటి వెంకట్రామయ్య ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. 1967లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎస్.చింతమనేనిపై దొడ్డపనేని ఇందిర కాంగ్రెస్ నుంచి గెలిచారు. 1972లో ఆలపాటి వెంకట్రామయ్యపై కాంగ్రెస్ నుంచి, 1978లో జనతా పార్టీ నుంచి దొడ్డపనేని ఇందిర శాసనసభకు ప్రాతనిధ్యం వహించారు. 1983, 1985లో వరుసగా రెండుసార్లు దొడ్డపనేని ఇందిరపై అన్నాబత్తుని సత్యనారాయణ టిడిపి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. 1989లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నాదెండ్ల భాస్కరరావు చేతిలో అన్నాబత్తుని సత్యనారా యణ ఓటమి చెందారు. తిరిగి 1994లో టిడిపి నుంచి పోటీ చేసిన డాక్టర్ రావి రవీంద్రనాథ్, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నాదెండ్ల భాస్కరరావును ఓడించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీచేసిన డాక్టర్ గోగినేని ఉమ, కాంగ్రెస్ అభ్యర్థి కొణిజేటి రోశయ్య పై విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన నాదెండ్ల మనోహర్ చేతిలో టిడిపి నుంచి పోటీచేసిన డాక్టర్ గోగినేని ఉమ ఓడిపోయారు. 2009లోనూ ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి నాదెండ్ల మనోహర్, టిడిపి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రజారాజ్యం నుంచి కిలారి వెంకటరోశయ్య పోటీ చేయగా మనోహర్ స్వల్ప ఆధిక్యంతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో వైసిపి నుంచి అన్నాబత్తుని శివకుమార్, టిడిపి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీచేయగా ఆలపాటి గెలుపొందారు. తిరిగి 2019 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి అన్నాబత్తుని శివకుమార్ వైసిపి నుంచి, టిడిపి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ పోటీచేయగా, త్రిముఖ పోటీలో శివకుమార్ గెలుపొందారు. తాజాగా 2024 ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి తరుపున జనసేన నుంచి నాదెండ్ల మనోహర్, వైసిపి నుంచి అన్నాబత్తుని శివకుమార్, ఇండియా వేదిక పార్టీలైన కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ బలపరచిన సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి శావల గోపాల్, బీఎస్పీ నుంచి కారుమంచి సునీల్ సందీప్, మరికొంత మంది ఇండిపెండెంట్లు పోటీ చేయగా నాదెండ్ల మనోహర్ 48 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇప్పటి వరకూ తెనాలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించిన వ్యక్తిగా మనోహర్ రికార్డు సృష్టించారు.




నాదెండ్ల భాస్కరరావు



అన్నాబత్తుని సత్యనారాయణ



నాదెండ్ల మనోహర్



అన్నాబత్తుని శివకుమార్









పుల్లారావును కలిసిన అరవిందబాబు

ప్రజాశక్తి - చిలకలూరిపేట : చిలకలూరిపేట ఎమ్మెల్యేగా గెలిచిన పత్తిపాటి పుల్లారావును నరసరావుపేట ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ చదలవాడ అరవిందబాబు చిలకలూరి పేటలోని పుల్లారావు నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయనవెంట కపిలవాయ విజయ్ కుమార్, గొట్టిపాటి జనార్దన్‌బాబు ఉన్నారు.

ప్రజాశక్తి - నరసరావుపేట : ఎమ్మెల్యేగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు గెలుపు సందర్భంగా పట్టణంలోని నాలుగో వార్డులోని జెండా చెట్టు వద్ద మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ మీరావలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. దశాబ్దాలుగా నియోజకవర్గాన్ని ఏలుతున్న నియంతలను ఓడించి అరవింద బాబును గెలిపించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు సిద్ధమయ్యారని మీరావలి అన్నారు. అరవిందబాబు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకర్గంగా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం వైసిపి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా, కుట్రలు చేసినా పార్టీ కార్యకర్తలు అండగా నిలిచారన్నారు. వారి కష్టాన్ని, శ్రమను వృధా కానివ్వనని చెప్పారు.

కూటమి విజయం చారిత్రాత్మకం

- **నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం**
- **నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం చారిత్రాత్మకమని టిడిపి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నాడు ఇందిరాగాంధీ అహంకారానికి ఆంధ్రుల ఆత్మగౌరవం అనే నినాదంతో నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఎలాగైతే చారిత్రాత్మక విజయం సాధించారో అదే బాటలో నేడు జగన్మోహన్‌రెడ్డి అహంకార పూరిత, నియంత పాలనకు చరమగీతం పాడుతూ నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక విజయాన్ని అందుకుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంకార పూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవని ఇందుకు నిదర్శనమే ఇటీవల వచ్చిన ఎన్నికల ఫలితాలని అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రభావం ఈ ఎన్నికలలో ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. టిడిపి పేరు చెబితే దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులుకు పాల్పడుతున్న తరుణంలో మొక్కవోని ధైర్యంతో పార్టీకి అండగా నిలబడిన నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు సమయంలో టిడిపికి చంద్రబాబుకు, లోకేష్‌కు అండగా నిలబడి ఎన్డీఏ కూటమి ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించి కూటమి అఖండ మెజారిటీకి పాటుపడిన



జనసేనాని పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎన్డీఏ కూటమిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని, తద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి మరిన్ని నిధులు సమకూర్చి రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తారని తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరిని కలుపుకుపోతూ కుల మతాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తానని నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు, నియోజకవర్గంలో టిడిపి విస్తరణకు



తన వంతు కృషి చేస్తానని అన్నారు. కూటమి విజయానికి కృషిచేసిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
9
బుధవారం 12 జూన్ 2024

జీవో 117ను రద్దు చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ .వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని అస్థవ్యస్థం చేసి, పేద విద్యార్థులను బడికి దూరం చేసిన జిఒ 117ను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం యుటిఎఫ్ గుంటూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం గుంటూరు బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కొత్త విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం క్యాంపెయిన్‌కు పిలుపు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. జిఒ 117 వల్ల 14200 పాఠశాలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. దాదాపు లక్షన్నర మంది విద్యార్థులు బడికి దూరం అయ్యారన్నారు. కావున ప్రభుత్వ హామీ ప్రకారం జిఒ 117ను రద్దు చేయాలని కోరారు. అలాగే 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటన్నిటినీ భర్తీ చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉంచి, బోధనకే పరిమితం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మెగా డిఎస్‌సి నిజంగా మెగా డిఎస్‌సిగా ఉండాలంటే 25వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలలను 1-5 తరగతులతోనే కొనసాగించాలని కోరారు. తెలుగు మీడియం కూడా కొనసాగించాలని, పిల్లలకు మీడియంను ఎన్నుకునే స్వేచ్ఛ ఉండాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్.కుసుమకుమారి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్, జిల్లా సహాధ్యక్షులు ఏఎల్.శివపార్వతి, కోశాధికారి గయాసుద్దౌలా, గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక రాజాగారితోటలోని విత్తనదుకాణాలలో ఎడిఎ సునీత నేతృత్వంలో గుంటూరు వ్యవసాయ సంచాలకులు ఎం.సునీల్‌తో కలిసి వ్యవసాయశాఖ విత్తన తనిఖీ బృందం మంగళవారం పలు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, గోడౌన్‌లోని నిల్వలతో సరిపోల్చారు. శ్రీహైకో సీడ్స్, శ్రీవెంకటసాయి సీడ్స్, శ్రీకీర్తి కాటన్ సీడ్స్, తరుణ్ హైబ్రిడ్ సీడ్స్, లక్ష్మీ శ్రీనివాస సీడ్స్, విజేత సీడ్స్ కార్పొరేషన్ దుకాణాలతో తనిఖీలు చేపట్టారు. సోర్స్ సర్టిఫికెట్ చూపని కారణంగా రూ.6300ల విలువైన 12 రకాల కూరగాయల విత్తన ప్యాకెట్లను శ్రీవెంకటసాయి సీడ్స్‌లో అమ్మకం నిలుపుదల చేశారు. షోకాజు నోటీసులు జారీ చేసి, వివరణ కోరనున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పికి మించి, విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఈ తనిఖీలలో అర్బన్ వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.


ఎ. రోహన్


సి. రేవంత్


ఐ. హనీత్


టి సంజయ్ తేజ్

ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఎంసెట్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కాలేజి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.మోహన్‌రావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఐ.హనీత్ 387, టి.సంజయ్‌తేజ 494, ఎ.రోహన్ 904, సి.రేవంత్ 957, పి.అమరలోకేష్ 1015, పి.గౌతమ్ 1195, కె.కారుణ్య 1206, ఎం.నాగసాయిప్రకాష్ 1219, బి.యోగ విజయ్‌కుమార్ 1369, సిహెచ్.వెంకట ఉదయ్ ఆదిత్య 1377, కె.దక్షిణ్ 1777, ఎం.వివేక్ పూజిత్‌కుమార్ 1964 ర్యాంకులు సాధించారని అన్నారు. ప్రణాళికాబద్దమైన విద్యాబోధన వల్ల అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. ఉత్తమ ర్యాంకర్లను విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్స్ ఉపాధ్యక్షులు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ జూనియర్ కాలేజిల ప్రిన్సిపాల్స్ జె.మోహన్‌రావు, వై.వెంకటేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

టిజెపిఎస్‌లో ముగిసిన వేసవి క్రీడా శిబిరం



ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపియస్ కళాశాలలో గతనెల రోజులనుండి జరుగుతున్న వేసవి క్రీడా శిబిరం మంగళవారం ముగిసింది. ఈముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం హాజరై మాట్లాడుతూ వేగంగా మారుతున్న కాలంలో టెక్నాలజీ ఉచ్చులోపడి ఎంతో మంది విద్యార్థులు వారి అమూల్యమైన జీవితాన్ని వధా చేసుకుంటున్నారని, సమయం దొరికితే చరవాణిలలో నిమగ్నమై వారి లక్ష్యాలను మరచిపోతున్నారని, ఆ మాయ వల ఉచ్చులో పడకుండా వారి జీవితాలను మంచి మార్గంవైపు వెళ్లేలా చూసే బాధ్యత తల్లితండ్రులది, గురువులదని చెప్పారు. కాబట్టి వేసవి సెలవుల్లో తమ కళాశాలలో ఏర్పాటు చేసిన క్రికెట్, కబడ్డీ, చెస్, అథ్లెటిక్స్ వివిధ రకాల ఆటలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వివిధ రకాల ఆటలలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందచేశారు. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజిని, వివిధ ఆటలలో శిక్షణ ఇచ్చిన కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళి, యన్.యస్.యస్.ప్రోగ్రాం అధికారి డాక్టర్.జె.వి. సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్టూడెంట్ టీచర్స్ ఎడ్యుకేషన్ పేరెంట్స్(స్టెప్) ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో తుళ్లూరు మండలం నెక్కల్లులో నిర్వహిస్తున్న ఉచిత వ్యక్తిత్వ వికాస తరగతుల్ని జయప్రదం చేయాలని స్టెప్ ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల క్రిష్ణయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ కె.పావని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొరిటపాడులోని స్టెప్ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణను వినియోగించుకోవాలని, హాజరయ్యే వారికి ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేసి, నిష్ణాతులైన సైకాలజిస్టులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. కరపత్రం ఆవిష్కరణలో ధర్మారెడ్డి, శరత్, మల్లిఖార్జున్, సతీష్‌బాబు, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాల కోసం 9666813833, 7386883244 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య తదితరులు


చినరాజప్ప కు మొమెంటో బహూకరిస్తున్న ఉప కమిషనర్

మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల సార్వత్రిక ఎన్నికలలో పెద్దాపురం నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా గెలుపొందిన నిమ్మకాయల చిన రాజప్ప సోమవారం పెదకాకాని మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ ఉపకమిషనర్, కార్య నిర్వహణాధికారి దాసర శ్రీరామవరప్రసాదరావు ఆలయ మర్యా దలతో స్వాగతించి, ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు అభిషేకము, ప్రత్యేక పూజల అనంతరం నిత్య కళ్యాణ మండపంలో ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు ఎమ్మెల్యే కు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ స్వామి వారి శేషవస్త్రముతో ఎమ్మెల్యే ను సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు.

కేంద్రమంత్రి అశ్వనివైష్ణవుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి క్యాబినెట్లో రైల్వే శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశ్విని వైష్ణవి కి సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ కమిటీ సభ్యులు ఏఎన్యూ అధ్యక్షులు పిల్లి నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశ అభివృద్ధిలో నరేంద్ర మోడీ పాత్ర కీలకంగా ఉందని గడిచిన 10 సంవత్సరాలలో భారతదేశాన్ని అగ్ర పదాన నిలిపేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. అలాగే రైల్వే శాఖ మంత్రిగా అశ్విని వైష్ణవ్ భారత దేశ రైల్వే రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రేపటి నుండి పాఠశాల పున: ప్రారంభం

ప్రజాశక్తి చేబ్రోలు : జూన్ 13వ తేదీ పాఠశాల పునః ప్రారంభం కానున్నదని తెలిపిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరు ప్రధాన ఉపాధ్యాయులు వై ఏడుకొండలు తెలిపారు. జూన్ 12న నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యాక్రమం ఉన్నందున పాఠశాలలను 13వతేదీన ప్రారంభిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ఏడుకొండలు ప్రకటనలో తెలిపారు. గురువారం పాఠశాల పునః ప్రారంభమవుతుందని తెలియజేశారు. కాబట్టి అందరూ విద్యార్థులు 13వ తారీకు పాఠశాలకు యూనిఫామ్ తో మీ దగ్గర ఉన్న పుస్తకాలతో హాజరు కావలసిందిగా తెలియజేయజేశారు.నూతనంగా పాఠశాలలో చేరి విద్యార్థులకు ఈ విషయమును తెలియజేస్తున్నామని అన్నారు.

వాణి ట్యుటోరియల్ వ్యవస్థాపకులు కెఎన్ఆర్ మాస్టారుకు సతీవియోగం

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి 11వ వార్డులో వాణి ట్యుటోరియల్ వ్యవస్థాపకులు కొల్లి నాగేశ్వరరావు (కేఎన్ఆర్ మాస్టారు) సతీమణి కొల్లి సామ్రాజ్యం అనారోగ్యంతో హైదరాబాదులో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆమె వయసు 60 సంవత్సరాలు. భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సామ్రాజ్యం మరణం పట్ల వాణి ట్యుటోరియల్స్ మిత్రబృందం, మంగళగిరి- తాడేపల్లి మండల యుటిఎఫ్ శాఖలు, ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ అండ్ ఉపాధ్యాయులు, మంగళగిరి డివిజన్ జనవిజ్ఞాన వేదిక, ఎస్ఎల్ఎం చైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు సంతాపం తెలిపి, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం జరిగాయి.

లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి : సిపిఎం


సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికలకు ముందు మంగళగిరిలో చేసిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. సిపిఎం పట్టణ కమిటీ సమావేశం మంగళవారం రాత్రి కొట్టె కరుణాకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 25 వేల మంది ఇళ్లపట్టాలు, ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రైల్వే స్థలాల్లో ఉంటున్న మరో 1100 కుటుంబాలు కూడా రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత కృష్ణా పుష్కరాల సందర్భంగా ఇళ్లు తొలగించిన పేదలకు నేటికీ పక్కా స్థలాలు ఇవ్వలేదన్నారు. వీరు కాకుండా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వేలాది మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. అర్హులందరికీ ఇళ్లస్థలాలు, పట్టాలు ఇస్తామని, ఇరిగేషన్ భూముల్లో ఉంటున్న వారికి రెగ్యులరైజేషన్ చేస్తామని, రైల్వేస్థలాల పేదలకు న్యాయం చేస్తామని లోకేష్ హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ మేరకు తాడేపల్లి పట్టణంలోని సీతానగరంలో శిలాఫలకం కూడా వేశారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు న్యాయం చేస్తే లోకేష్‌ను ప్రజలు గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం టిడిపిపై ఆధారపడిన సంగతిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని కేంద్రం నుంచి హామీ పొందడం, రాజధాని అమరావతికి నిధులు సమకూర్చుకుని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడం, కడప ఉక్కు ఫ్యాక్టరీ తదితర హామీలను అమలు జరిపించుకోవడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్రంలో కూడా మూడు పార్టీలు కలిసి ప్రధానికి నచ్చజెప్పి రాష్ట్రం అభివృద్ధి అయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమలులోకి ట్రాఫిక్ ఆంక్షలు

పలు మార్గాల్లో వాహనాల మళ్లింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గన్నవరం వద్ద సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచే జిల్లాలోని పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. పలు మార్గాల్లో వాహనాల రాకపోకలను మళ్లించారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లాఎస్‌పి తుషార్ దూడి ఒక ప్రకటనలో వెల్లడించారు. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను జాతీయ రహదారిపైకి అనుమతించడంలేదని ఎస్‌పి తెలిపారు. గుంటూరు నుంచి విశాఖ వెళ్లే వాహనాలను బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జ్, అవనిగడ్డ , పామూరు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా పంపుతున్నారు. చెన్నై నుండి వైజాగ్ వెళ్ళు వాహనాలు బుడంపాడు- తెనాలి - వేమూరు - వెల్లటూరు -పెనుమూడి- అవినిగడ్డ- పామర్రు-గుడివాడ -హనుమాన్ జంక్షన్ మీదుగా వైజాగ్ వెళ్లాలని సూచించారు. చెన్నై వైపు నుండి బాపట్ల చీరాల వైపు వెళ్ళు అన్ని వాహనాలు గుంటూరు ఏటుకూరు అండర్ పాస్ కింద నుండి పత్తిపాడు- పర్చూరు- చీరాల- బాపట్ల నుండి 216 నేషనల్ హైవే మీదుగా పంపుతున్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్ళు వాహనాలు ను పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వైపు పంపుతున్నారు. చెన్నై నుండి హైదరాబాద్ వెళ్లేవాహనాలు మేదరమెట్ల-అద్దంకి-పిడుగురాళ్ల వైపు మళ్లించారు. గుంటూరు నుండి విజయవాడ వైపు ఎటువంటి వాహనం లు అనుమతించబడ వన్నారు. చిలకలూరి పేట వైపు నుండి హైదరాబాద్ వైపు వెళ్ళుటకు వచ్చే వాహనాలు చిలకలూరి పేట నుండి చుట్టుగుంట, పేరేచర్ల మీదుగా పంపుతున్నారు.

బాధితురాలికి టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రక్తదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణానికి చెందిన కట్టా వరలక్ష్మి హార్టు ఆపరేషన్ కోసం మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. డాక్టర్లు ఆమెకు రక్తం అవసరమవుతుందని స్థానికంగా సోషల్ మీడియాలో మెసేజ్ పెట్టారు. విషయం తెలుసుకున్న టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు స్పందించారు. పట్టణానికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, ఎం.కళ్యాణ్, కె.సాయిచంద్, డి.సుజన్, ఎ.రాజేష్ అవసరమైన రక్తాన్ని ఇచ్చి బాధితురాలికి ప్రాణదానం చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి కుటుంబ సభ్యులు వారికి అభినందనలు తెలిపారు.

అడుగడుక్కీ ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి బుధవారం ప్రమాణ స్వీకర మహోత్సవ కార్యక్రమ దృష్ట్యా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ప్రజాలు ప్రత్యేక ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా వీక్షించుటకు ఏర్పాటు చేసినట్లుగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మలా కుమార్ మంగళవారం రాత్రి తెలిపారు. ప్రజలు బుధవారం ఉదయం 8:00 గంటలనుండి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించుటకు ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా వీక్షించుటకు మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ వారిచే తెలిపిన ప్రదేశాలలో స్టాండింగ్ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు కూర్చుని వీక్షించడానికి వీలుగా టెంట్లు ,కుర్చీల సదుపాయములు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. మంగళగిరి గౌతమ్ బుద్ధ రోడ్డు లో ఆల్ఫా హొటల్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, మంగళగిరి తెనాలి రోడ్డులో రాజీవ్ సెంటర్, మిద్దె సెంటర్ల లో,తాడేపల్లి పరిధిలోని నులకపేట అన్న క్యాంటీన్ సెంటర్, శ్రీ కష్ణ టెంపుల్ ఎదురుగా గల అంజిరెడ్డి కాంప్లెక్స్ వద్ద, ఉండవల్లి సెంటర్‌లో చంద్రబాబు ఇంటికి వెళ్లే దారి కరకట్ట రోడ్ లో, కాజా గ్రామ పరిధిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగల బైబిల్ మిషన్ గ్రౌండ్ వద్ద రెండు స్క్రీన్లు, కుంచనపల్లి ప్రాతూరు రోడ్డు జంక్షన్, హెచ్ పి పెట్రోల్ బంక్ నేషనల్ హైవే సర్వీస్ రోడ్లో రాజేశ్వరి నగర్, నవోదయ కాలనీల పరిధిలో, ఆత్మకూరు పరిధిలోని నిర్మలా స్కూల్ ఆర్చి వద్ద,పై తెలిపిన సెంటర్ లలో ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా సౌకర్యంగా వీక్షించుటకు 5 చోట్ల మొబైల్ ఎల్ఈడి లు,మిగతా 9 చోట్ల స్టాండింగ్ ఎల్ఈడి , టెంట్‌లు, కుర్చీల సదుపాయముతో నగర పాలక సంస్థ వారిచే ఏర్పాటు చేయడమైనది అని తెలిపారు.

ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించండి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ - జిజిహెచ్‌లో ఆరోగ్యశ్రీ సేవలపై సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ కార్డుఉన్న రోగులకు నూరు శాతం వైద్యం అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి నాట్కోలో ఆరోగ్య శ్రీ రోగులకు అందుతున్న సేవలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి ఆరోగ్య శ్రీ అందలేదని బాధ పడకూడదన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఈ విషయం పై వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డిఎంఇ, మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రుల తో సమీక్ష చేస్తారని అయన చెప్పారు. ప్రతి వైద్యుని ఆరోగ్య శ్రీ పని తీరు గురించి సమీక్ష చేస్తారని ఆయన అన్నారు. ఎన్ని ఆరోగ్య కేసులు చేస్తున్నారా లేదా అనేది వైద్యుల పని తీరుపై క్షేత్ర స్థాయి లో పరిశీలన కూడా చేస్తున్నారని అయన గుర్తు చేసారు. ప్రతి వైద్యుడు వ్యక్తిగత పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య మిత్ర పర్యవేక్షణ పూర్తిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఉండాలన్నారు. లేకపోతే ఆరోగ్య మిత్ర ల ద్వారా పని చేయించుకోవడం కష్టంగా ఉంటుందని అయన చెప్పారు. దేనివల్ల ఆరోగ్య మిత్రల పై అజమాయిషీ కోల్పోవడం జరుగుతుందన్నారు. ఆరోగ్య మిత్ర సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని సెలవు దినాల్లో కూడా కొంతమంది తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేస్తూ ఆరోగ్య శ్రీ లబ్దిదారులకు పథకం అందేవిధంగా కృషి చేయాలన్నారు. అందుకు ఆరోగ్య జిల్లా కో ఆర్డినేటర్ సహకరించాలన్నారు. ప్రతివార్డులో వైద్యులు, ఆరోగ్య మిత్ర, డి ఈ ఓ లతో సమన్వయము తో పని చేస్తూ ఆరోగ్య శ్రీ ని బలోపేతం చేయాలన్నారు. ఆరోగ్య శ్రీ లో 40 మంది పని చేశారని వారందరు వివిధ విభాగాల్లో పని చేశారని అయన చెప్పారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి వారి అవసరాలను గుర్తించి ప్రతి నెల అయిదు లక్షల జీతాలు చెల్లిస్తున్నామన్నారు. దీనివల్ల ఆసుపత్రి ఆర్థికంగా నష్ట పోతోందన్నారు. ప్రస్తుతం సిబ్బంది అవసరాన్ని గుర్తించి డి ఏం ఈ తెలియచేసి వారి ఆదేశల మేరకు నియమ నిబంధనల మేరకు అవసరాన్ని బట్టి వారిని నియమించుకునే విధంగా అనుమతి తీసుకోవాలని అయన అధికారులకు ఆదేశించారు. ఆప్తమాలజి విభాగం లో ఈ యస్ డబ్ల్యూ ఎల్ మిషన్ సత్వరమే అక్కడ నుంచి యూరాలజీ విభాగానికి తరలించాలన్నారు. ఆడియో మెట్రి పరికరం ఆడియాలజిస్టు టెక్నిషియన్ ను వెంటనే ఈ ఎన్ టి విభాగానికి కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని అయన సూచించారు. రిఫెరల్ ఆసుపత్రిగా ఉన్న గుంటూరు మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఏం ఈ ఆర్ కె సౌకర్యం కల్పించాలన్నారు. లేకుంటే ఆధునాతన మైన సంక్లిష్టమైన ఆపరేషన్లు వైద్యం చెయ్యడానికి సరైన ఆర్థిక వనరులు లేకపోవడం తో పని కుంటూ పడే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య శ్రీ సి ఈ ఓ లు ఈ విషయాన్నీ గుర్తించి ఏం ఈ ఆర్ కె సౌకర్యాన్ని కల్పించాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మానసిక విభాగం హెచ్ ఓ డి డాక్టర్ ఉమా జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట కిరణ్, జాయింట్ డైరెక్టర్ సుధారాణి, ఏడి సి హెచ్ నాగేశ్వర రావు పాల్గొన్నారు.



మనోహర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి- తెనాలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు సోమవారం ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌ను తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో గెలిచిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో కూటమి సాధించిన విజయంలో నాదెండ్ల మనోహర్ గొప్పదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కూడా మనోహర్ పాత్ర ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నన్నపనేని భాస్కరరావు , వేమ వరపు శివ కుమార్, ప్రకాష్, లక్ష్మణ్, యన్.కె.వి.ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

ఉద్యోగులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

గత ప్రభుత్వ హయాంలో రివర్స్ పిఆర్‌సి పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక ఇంక్రిమెంట్ ఇవ్వాలని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కోరారు. మంగళవారం స్థానిక నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 పిఆర్‌సిలో ప్రభుత్వం మోసపూరిత హామీ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నష్టపోయారన్నారు. తిరిగి ఆ నష్టాన్ని భర్తీ చేయటానికి కాబోయే సిఎం ఇంక్రిమెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మెరుగైన పిఆర్‌సి, ఐఆర్, డిఎ, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరిముల్లా , నగర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెద్దరత్తయ్య, నగర కోశాధికారి ముప్వ శ్రీనివాసరావు, జాన్ తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రమాద బాధితునికి ఎమ్మెల్యే లోకేష్ ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇటీవల షాక్ సర్క్యూట్ అయ్యి ఇల్లు కోల్పోయిన ఎం టి ఎం సి పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన ఎడ్లపల్లి సాంబయ్య అనే బాధితుడికి మంగళవారం చిర్రావూరు గ్రామ టిడిపి అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు రూ. 25వేలను అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంతో సర్వం కోల్పోయిన యడ్లపల్లి సాంబయ్యకు జరిగిన నష్టాన్ని తెలుసుకున్న మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ రూ.25వేల రూపాయలు అందజేశారని ఆయన తెలిపారు. అదేవిధంగా బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు నూతనంగా ఇల్లు నిర్మించేందుకు హామీ ఇచ్చారని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ నాయకులు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇఎపి సెట్ ఫలితాల్లో ఆర్కా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఇఎపి సెట్ ఫలితాల్లో ఆర్కా విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల డైరెక్టర్లు అనిల్‌కుమార్, వాసుబాబు, డీన్ శ్రీనివాసులు తెలిపారు. వెయ్యిలోపు ఇద్దరు, ఐదువేల లోపు 14, పదివేల లోపు 32, పదిహేను వేలలోపు 65, ఇరవై వేలలోపు 90 మంది ర్యాంకులు సాధించారన్నారు. అలాగే ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంలో ఐదు వందల లోపు 4గురు, వెయ్యిలోపు 8 మంది, ఐదువేలలోపు 35, పదివేల లోపు 80 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకర్లను డైరెక్టర్లు, డీన్ అభినందించారు.

ఈఎపి సెట్‌లో భాష్యం సత్తా

- టాప్ టెన్‌లో 4 ర్యాంకులు కైవశం

ప్రజాశక్తి-గుంటూరు



మొదటిర్యాంకర్ ఎం.జిష్ణుసాయి | సెకండ్ ర్యాంకర్ ఎం సాయి యశ్వంత్ రెడ్డి | 5వ ర్యాంక్ కె.మనీష్ చౌదరి | 10వ ర్యాంక్ కె ప్రభాస్ | 25వ ర్యాంక్ ఎస్ ప్రణయ్ విక్టర్ | 29వ ర్యాంక్ ఎం శ్రీ చరిత సాయి

ఎపి ఈఎపి సెట్-2024 ఫలితాలలో భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఎం.జిష్ణుసాయి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎం.సాయియశ్వంత్‌రెడ్డి స్టేట్ రెండో ర్యాంకు, కె.మనీష్‌చౌదరి 5వ ర్యాంకు, కె.ప్రభాస్ స్టేట్ 10వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే కె.హర్షిత స్టేట్ 16వ ర్యాంకు, ఎస్.ప్రణయ్ విక్టర్ స్టేట్ 25వ ర్యాంకు, ఎం.శ్రీచరిత 29వ ర్యాంకు, టి.మునికార్తీక్ 35వ ర్యాంకు, పి.శ్యామ్ 49వ ర్యాంకు, కె.చైతన్య 54 ర్యాంకు, ఎం.సాయిజస్వంత్‌రెడ్డి 61వ ర్యాంకు, ఆర్.రాజ్‌శ్రీవర్ధన్ 83వ ర్యాంకు వంటి వందలోపు 12 స్టేట్ ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని రామకృష్ణ పేర్కొన్నారు. భాష్యం వరుసగా రెండోసారి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించటంతోపాటు, టాప్ టెన్‌లో నాలుగు ర్యాంకులు కైవశం చేసుకోవటం గర్వకారణంగా ఉందన్నారు. భాష్యం ఐఐటి జెఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో తిరుగులేని ఫలితాలు సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కూడా భాష్యం విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారన్నారు. రాష్ట్ర స్థాయి ఈఎపి సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.